క్లుప్తంగా

టెన్త్ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలి



ప్రతిభ చాటిన విద్యార్థులతో సీఐ నారాయణరావు

ఎస్.రాయవరం : పాఠశాల స్థాయిలో మంచి ర్యాంకులు సాధించిన విద్యార్థులు భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని నక్కపల్లి సీఐ నారాయణరావు అన్నారు. మండలంలో 10వ తరగతి విద్యార్థులకు ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన మోడల్ టెస్ట్‌లో రాణించిన విద్యార్థులకు సీఐ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ప్రాక్టికల్‌గా నిర్వహించిన టెస్ట్‌ల్లో మంచి ర్యాంకులు సాధించినవారు మరింత బాగా చదివి త్వరలో జరగబోయే 10వ తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని సూచించారు.

అంగన్‌వాడీలను ఆదుకోవాలి



తహసీల్దార్ భాగ్యవతికి వినతిపత్రం అందిస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

రాంబిల్లి : అంగన్‌వాడీ వర్కర్లను ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ మండల కార్యదర్శి జి.దేముడునాయుడు కోరారు. ఈ మేరకు అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి ఆయన తహసీల్దార్ పి. భాగ్యవతికి వినతిపత్రం అందజేశారు. కనీస వేతనాలు ఇతర డిమాండ్లు పరిష్కరించాలని అంగన్‌వాడీ వర్కర్లు కోరారు.

పదిలో రాణించాలంటే ప్రణాళిక అవసరం



మాట్లాడుతున్న ఎంపీడీవో రవికుమార్

మునగపాక : ప్రణాళికాపరంగా చదువుకుంటే పది పరీక్షల్లో రాణించవచ్చని ఎంపీడీవో పి.రవికుమార్ అన్నారు. మండలంలోని తోటాడ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులు ఫేర్‌వెల్ ఫంక్షన్ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ ఏకాగ్రతతో కష్టపడి చదువుకోవాలని, తద్వారా పదో తరగతిలో మెరుగైన మార్కులు సాధించవచ్చని అన్నారు. లక్ష్యంతో చదువుకుంటే ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుందన్నారు. హెచ్‌ఎం కుమార్, పీఎంసీ చైర్మన్ భాస్కరరావు, వైఎస్సార్‌సీపీ నేత దొడ్డి బాలాజీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉగాది, శ్రీరామనవమి వేడుకలకు ఏర్పాట్లు



రాజేష్‌ను సత్కరిస్తున్న అసోసియేషన్ సభ్యులు

అనకాపల్లిటౌన్: శారదా కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ ఏడాది ఉగాది, శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు సారిపల్లి రాజేష్ తెలిపారు. స్థానిక శారదా కాలనీలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అసోసియేషన్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు చెప్పారు. కాలనీలోని వివిధ సమస్యలను ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లామని, ఇప్పటికే రహదారులు నిర్మించారని చెప్పారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో కల్యాణ మండపం నిర్మాణానికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం కరోనా సమయంలో మృతి చెందిన మాజీ అధ్యక్షుడు సారిపల్లి నూకారాజుకు రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. అనంతరం అసోసియేషన్ నూతన అధ్యక్షుడు రాజేష్‌ను సభ్యులు ఘనంగా సత్కరించారు. అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యంపై అవగాహన

అనకాపల్లిటౌన్: ఆయుర్వేద వైద్యంపై విద్యార్థి దశ నుంచే అవగాహన పెంచుకోవాలని ఆయుష్ వైద్యాధికారి కె.లావణ్య సూచించారు. జీవీఎంసీ భీమునిగుమ్మం హైస్కూల్లో సోమవారం ఆయుష్ వైద్యంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఇంగ్లిష్ మందులపై ఆధారపడకుండా ఆయుర్వేద వైద్యాన్ని ఆచరించాలని పిలుపునిచ్చారు.

గ్రామాల్లో కొత్త అమావాస్య సందడి



చినగుమ్ములూరు నూకాంబిక అమ్మవారి ఆలయం



గ్రామంలో ఆకట్టుకుంటున్న విద్యుదలంకరణ



అమ్మవారిని దర్శించుకున్న నేతలు



విద్యుద్దీపాలంకరణలో అమ్మవారి ఆలయ ప్రాంగణం

ఎస్.రాయవరం : గ్రామాల్లో కొత్త అమావాస్య సందడి నెలకొంది. చినగుమ్ములూరు, తిమ్మాపురం, పెదగుమ్ములూరు, గుర్రాజుపేట, లింగరాజుపాలెం తదితర గ్రామాల్లో కొత్త అమావాస్యను పురస్కరించుకుని నూకాంబిక అమ్మవారి జాతర నిర్వహించడం ఆనవాయితీ.

సోమవారం రాత్రికి సాగరం పేరుతో అమ్మవారి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పురవీధుల్లో భారీ విద్యుదలంకరణలు ఆకర్షణీయంగా నిలిచాయి. మంగళవారం ఉదయం భక్తులు అమ్మవారికి పసుపు కుంకుమలు, మొక్కులు చెల్లించుకునేందుకు ఏర్పాట్లు చేశారు. దీంతో గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది.

నూకాలమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు

నక్కపల్లి: మండలంలో వేంపాడు, చందనాడ గ్రామాల్లో నూకాలమ్మ జాతర సోమవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా గ్రామదేవత నూకాలమ్మ ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఉదయాన్ని అమ్మవారిని దర్శించుకుని కానుకలు మొక్కుబడులు సమర్పించుకున్నారు. చుట్టుపక్కల గ్రామాలతో పాటు, స్థానికులు కూడా అమ్మవారిని దర్శించుకునేందుకు తరలి రావడంతో ఆలయాలు కిటకిటలాడాయి. అమ్మవారిని కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, మండల పార్టీ అధ్యక్షుడు పొడగట్ల పాపారావు, డీసీఎంఎస్ మాజీ ఉపాధ్యక్షుడు మణిరాజు, సర్పంచ్‌లు భార్గవ్, ఎంపీటీసీ తిరుపతిరావు తదితరులు దర్శించుకున్నారు.

మంగవరంలో అమ్మవారి జాతర

పాయకరావుపేట : మండలంలో గల మంగవరం గ్రామంలో నూకాంబిక ఆలయం ప్రాంగణంలో విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. సోమవారం రాత్రి నూకాలమ్మ జాతర వైభవంగా నిర్వహించారు. మంగళవారం కొత్త అమావాస్య సందర్భంగా అమ్మవారి దర్శనానికి భక్తులకు ఆలయ అభివృద్ధి కమిటీ వారు ఏర్పాట్లు చేశారు. రాత్రంతా గరగ ఆటలతో జాతర నిర్వహిస్తారు.

నూకాంబిక జాతరకు సర్వం సిద్ధం

రాంబిల్లి : నూకాంబిక అమ్మవారి జాతరకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. మండ లంలో దిమిలి, వెల్చూరు, కొప్పుగొండుపాలెం తదితర గ్రామాల్లో కొత్త అమావాస్య సందర్భంగా నూకాంబిక అమ్మవారి పండగను నిర్వహిస్తారు. ఈ మేరకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పలు చోట్ల అన్నసమారాధనలు ఏర్పాటు చేశారు. పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు.



దిమిలిలో...

రూ.16.38 లక్షలకు వారపు సంత ఆశీలు వేలం



వారపుసంతలో ఆశీలు వసూలు వేలం నిర్వహిస్తున్న దృశ్యం

నక్కపల్లి : మండల కేంద్రంలో వారపు సంత ఆదాయం రూ.16.38 లక్షలు వచ్చింది. ఈ సంతలో ఆశీలు వసూలు చేసుకునే హక్కుకు సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించారు. ఇక్కడ ప్రతి బుధవారం పశువుల సంత, ప్రతి శుక్రవారం ఎండు చేపల వ్యాపారం, కూరగాయల వ్యాపారాలు జరుగుతుంటాయి. శుక్రవారం జరిగే ఎండు చేపల సంతలో పూరీ, పారాదీప్, శ్రీశైలం, కలకత్తా, హైదరాబాద్, నాగార్జున సాగర్, విజయవాడ, విశాఖపట్నం తదితర ప్రాంతాల నుంచి వ్యాపారులు వచ్చి ఈ పరిసర ప్రాంతాల్లో లభించే ఎండు చేపలను కొనుగోలు చేసి తీసుకెళ్తారు. ఆయా ప్రాంతాల్లో లభించే చేపలను కూడా ఇక్కడ విక్రయిస్తుంటారు.

ప్రతి వారం ఇక్కడ సుమారు కోటిరూపాయల పైబడే ఎండు చేపల ఎగుమతులు, దిగుమతులు జరుగుతుంటాయి. అలాగే కూరగాయలు వ్యాపారం జరుగుతుంది. బుధవారం పశువుల సంత జరుగుతుంది. చుట్టుపక్కల జిల్లాల నుంచి వ్యాపారుల వచ్చి పశువుల అమ్మకాలు, కొనుగోళ్లు చేస్తుంటారు. ఇక్కడ జరిగే వ్యాపారాలకు సంబంధించి వ్యాపారుల నుంచి ఆశీళ్లు వసూలు చేసుకునేందుకు ఏడాదికి ఒకమారు వేలం నిర్వహిస్తారు. 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు ఆశీలు వసూలు చేసుకునేందుకు మండల పరిషత్ వారు వేలం నిర్వహిస్తారు. ఇక్కడ వేలం నిర్వహించగా వచ్చిన ఆదాయాన్ని పంచాయతీ వారు, మండలపరిషత్ వారికి 60:40 నిష్పత్తిలో కేటాయిస్తారు. ఈ నిధులతో పలు అభివృద్ధి పనులు చేపడుతుంటారు. సోమవారం నిర్వహించిన వేలంలో రూ.16.38 లక్షలకు నక్కపల్లికి చెందిన దేవవరపు కొండలరావు హెచ్చుపాటదారుడిగా ఆశీలు వసూలు చేసుకునే హక్కు దక్కించుకున్నారు. గత ఏడాది రూ.16.02 లక్షల ఆదాయం లభించింది. ఈ ఏడాది మరో రూ.36 వేలు ఆదాయం పెరిగింది. ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, వైస్ ఎంపీపీ వీసం నానాజీ, ఎంపీడీవో సీతారామరాజు, ఈవోపీఆర్‌డీ వెంకటనారాయణల సమక్షంలో వేలం నిర్వహించారు. హెచ్చుపాటదారుడికి వేలం ఖరారు చేస్తున్నట్లు ఎంపీడీవో ప్రకటించారు.

రోడ్డు పనుల నిలిపివేతతో ఇక్కట్లు



రోడ్డుపై గతుకుల్లో చేరిన వర్షపు నీరు

ఎస్.రాయవరం : నిధులు విడుదలైనా నిర్మాణం చేపట్టకపోవడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అడ్డురోడ్డు నుంచి ఇందేశమ్మ వాక వరకు రూ.16 కోట్లు రోడ్డు విస్తరణ పనులకు నిధులు విడుదల కావడంతో, రెండు నెలలు క్రితం శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. అయితే మరే ఆటంకం వచ్చిందో పనులు నిలిపివేశారు. అడ్డురోడ్డు నుంచి ఇందేశమ్మవాక వరకు సుమారు 14 కిలోమీటర్లు మేర రోడ్డు దెబ్బతిని తీవ్ర సమస్యగా మారింది. గడిచిన రాత్రి కురిసిన భారీ వర్షంతో రోడ్డుపై గతుకుల్లో నీరు చేరి అస్తవ్యస్తంగా మారాయి. ఇకనైనా అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని వాహన చోదకులు కోరుతున్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



మహిళలకు బహుమతులు అందజేస్తున్న వాడ్రాపల్లి సర్పంచ్ నూకరాజు

మునగపాక : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు కోరారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా మ్యాజిక్ బస్ సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు నిర్వహించిన పలు ఆటల పోటీల్లో గెలుపొందిన మహిళలకు సోమవారం ఆయన బహుమతులు అందజేశారు.

నూకరాజు మాట్లాడుతూ విద్యాభివృద్ధికి, మహిళల్లో ఆత్మవిశ్వాసం నింపేందుకు మ్యాజిక్ బస్ సంస్థ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సంస్థ డీపీఎం కె.ఆనంద్, అకాడమిక్ ఎడ్యుకేటర్ ఆనంద్, పంచాయతీ కార్యదర్శి శ్రీదేవి కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఫేర్‌వెల్ డే



ఉపాధ్యాయులతో పదో తరగతి విద్యార్థులు

ఎస్.రాయవరం : కొరుప్రోలు, దార్లపూడి ఉన్నత పాఠశాలలో సోమవారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు పలికేందుకు విద్యార్థులు ఫేర్‌వెల్ డే కార్యక్రమం నిర్వహించారు. త్వరలో పరీక్షలకు వెళ్లే విద్యార్థులకు ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులతో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహింపజేశారు. పరీక్షల తరువాత పాఠశాలను విడిచి వెళ్లే విద్యార్థులు గుర్తుగా ఉపాధ్యాయులతో గ్రూప్ ఫొటోలు తీసుకుని ఆనందించారు.



పాఠశాలలో నృత్యాలతో అలరిస్తున్న విద్యార్థినులు

సమగ్ర అభివృద్ధితో మంచి ఫలితాలు



గొల్లపేట ఎంపీపీ స్కూల్‌లో విద్యార్థులతో కోఆర్డినేటర్ అశోక్‌కుమార్

కోటవురట్ల : పాఠశాలల్లో సమగ్ర అభివృద్ధి కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యలు పెరుగుతాయని సమగ్ర అభివృద్ధి పథకం జిల్లా కో ఆర్డినేటర్ అశోక్‌కుమార్ అన్నారు. గొల్లపేటలో ఎంపీపీ స్కూల్‌ను ఆయన సోమవారం సందర్శించి 1, 2 తరగతుల విద్యార్థుల సామర్థ్యం పరీక్షించారు. ఈ కార్యక్రమం ద్వారా పిల్లలతో వివిధ రకాల ఆటలు ఆడించడం, పజిల్స్, చిత్రం ద్వారా అందులోని ప్రత్యేకతలను గుర్తించడం, అంకెలు పలికే ఆటలు ఆడడం, తెలుగు, ఇంగ్లిషు చదవడం, ఉచ్ఛారణ వంటి అంశాలను పరిశీలిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం జీవన్ పాల్గొన్నారు.

పుట్టిన రోజుకో మొక్క

- పచ్చదనానికి ప్రాధాన్యం
- ఏటికొప్పాక ప్రభుత్వ పాఠశాలలో వినూత్న కార్యక్రమం



ఏటికొప్పాక ప్రాథమిక పాఠశాలలో మొక్క నాటుతున్న విద్యార్థి

యలమంచిలి : పర్యావరణాన్ని రక్షించేందుకు మొక్కలు ఎంతగానో ఉపకరిస్తాయి. ప్రాణికోటికి అవసరమైన ఆక్సిజన్‌ను ఉత్పత్తి చేస్తాయి. అలాంటి మొక్కల పెంపకాన్ని విద్యార్థి దశ నుంచే అలవాటు చేయడానికి యలమంచిలి మండలం ఏటికొప్పాక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల పుట్టిన రోజు వేడుకల్లో భాగంగా పాఠశాల ఆవరణలో ఒక మొక్క నాటేందుకు నిర్ణయించారు. ఆ మేరకు విద్యార్థులను సన్నద్ధం చేశారు. సోమవారం పాఠశాలలో శ్రీను అనే విద్యార్థి పుట్టిన రోజు సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మొక్కల పెంపకం, పరిరక్షణపై ఆసక్తి కలిగించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు స్కూల్ కమిటీ చైర్మన్ మొల్లేటి ప్రసాద్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నేతి సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ నాయకులు సేనాపతి రాము, ఏటికొప్పాక గ్రామం వైఎస్సార్‌సీపీ నాయకులు కరణం రవి, వీసం బంగారుబాబు, యర్రంశెట్టి రమణ, హైస్కూల్ కమిటీ చైర్మన్ డి.రమణ, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్ బకాయిలు చెల్లించాలి

మునగపాక : బకాయిపడిన విద్యుత్ బిల్లులు చెల్లించేలా సర్పంచ్‌లు సహకరించాలని ఈవోఆర్డీ ఈశ్వరరావు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం పంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా పలు పంచాయతీల నుంచి విద్యుత్ బకాయిలు పేరుకుపోతున్నాయన్నారు. సర్పంచ్‌లు చొరవ చూపి బిల్లులు చెల్లించేలా చూడాలన్నారు. ఇందుకు సర్పంచ్‌లంతా ముక్తకంఠంతో ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో విద్యుత్ బిల్లులు చెల్లించడం కష్టతరంగా ఉంటుందని ఈ విషయమై ప్రభుత్వం తగు ఆలోచన చేయాలన్నారు. ఇదిలా ఉండగా ఇళ్ల పన్నుల వసూళ్లపై దృష్టి సారించాలని, తద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూరుతుందన్నారు.

సకాలంలో చికిత్సతో నోటి వ్యాధులు దూరం



ఎన్టీఆర్ వైద్యాలయం నుంచి ర్యాలీ ప్రారంభిస్తున్న ఆర్‌ఎంవో భారతి, వైద్యులు, సిబ్బంది

అనకాపల్లిటౌన్: నోటి క్యాన్సర్ వ్యాధిని మొదటి దశలో గుర్తిస్తే సకాలంలో చికిత్స అందించి నయం చేయవచ్చని ఎన్టీఆర్ వైద్యాలయం ఆర్‌ఎంవో భారతి అన్నారు. ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక వైద్యాలయం నుంచి ఎన్టీఆర్ క్రీడా మైదానం వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నోటి ఆరోగ్య దినోత్సవంలో భాగంగా వారం రోజుల పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ప్రతి రోజు ఉదయం , సాయంత్రం వేళల్లో నోటిని శుభ్రం చేసుకోవాలని, దంత సమస్యలుంటే వైద్యులను సంప్రదించాలని సూచించారు. వైద్యాలయం దంత వైద్యులు భానుప్రియ, డి.రజని మాట్లాడుతూ మద్యం, పొగాకు తాగడం వల్ల నోటి క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ప్రాథమిక దశలోనే నోటి క్యాన్సర్‌ను గుర్తించినట్లయితే చికిత్స ఇవ్వడం ద్వారా నివారించవచ్చని పేర్కొన్నారు. చిన్న పిల్లల కోసం ఎన్టీఆర్ వైద్యాలయం ఎదురుగా ప్రభుత్వం సత్వర బాలల చికిత్స కేంద్రాన్ని ఏర్పాటు చేసిందని తెలిపారు. పిల్లలకు వచ్చే వివిధ రకాలైన వ్యాధులకు చికిత్స అందిస్తున్నట్లు వారు చెప్పారు. కార్యక్రమంలో వైద్యులు రాజేష్, కాపు శ్యామల పాల్గొన్నారు.

ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



తోటాడ సచివాలయంలో ఆధార్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ మంగవేణి కోటేశ్వరరావు

మునగపాక : అర్హులైన ప్రతి ఒక్కరూ ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని తోటాడ సర్పంచ్ దొడ్డి మంగవేణి కోటేశ్వరరావు కోరారు. తోటాడ సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని సోమవారం ఆయన స్థానిక ఎంపీటీసీ కాండ్రేగుల వెంకటలక్ష్మితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ ఆధార్‌లోని చేర్పులు, మార్పులకు అవకాశం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ సంబంధిత సేవలను వినియోగించుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత దొడ్డి బాలాజీ, సచివాలయ ఉద్యోగులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ఆధార్ కేంద్రాన్ని ఎంపీడీవో రవికుమార్ సందర్శించారు.

భావనారుషి ఆలయంలో పెళ్లిరాట




తోటాడలో పెళ్లిరాట మహోత్సవంలో భక్తులు

మునగపాక : మండలంలోని తోటాడ భావనారుషి ఆలయంలో సోమవారం భక్తి శ్రద్ధలతో పెళ్లిరాట మహోత్సవం నిర్వహించారు. ఈ నెల 22న తోటాడలో జరగనున్న భావనారుషి భద్రావతిల కల్యాణంలో భాగంగా వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య కార్యక్రమం నిర్వహించారు. కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. 22న ఉదయం నుంచి ప్రత్యేక పూజలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. దొడ్డి ఆదినారాయణ, కాకి అప్పారావు, నూకలక్ష్మి, నారాయణ, సూరిబాబు, బాబూరావు, జగదీష్,అప్పారావు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న సాంస్కృతిక కార్యక్రమాలు



ఉత్కంఠగా జరుగుతున్న క్రికెట్



ఆకట్టుకుంటున్న విద్యుద్దీపాలంకరణ

కోటవురట్ల : కె.వెంకటాపురం గ్రామంలో కొత్త అమావాస్య పండగను పురస్కరించుకుని నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. జిల్లా స్థాయిలో జరుగుతున్న క్రికెట్ టోర్నీ సోమవారంతో ముగిసింది. విజేత జట్లకు మంగళవారం బహుమతి ప్రదానం చేయనున్నారు. శ్రీ నూకాంబిక అమ్మవారి జాతర మహోత్సవం సందర్భంగా గ్రామం అంతా విద్యుద్దీపాలంకరణ ఏర్పాటు చేశారు. మంగళవారం వేకువ జాము నుంచి ఆలయంలో పూజా కార్యక్రమాలు జరుగుతాయని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

సహకార సంఘ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



సభ్యులకు వ్యవసాయేతర రుణాలు అందజేస్తున్న పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి రామ్మోహనరావు

మునగపాక : సహకార సంఘ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మునగపాక పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కోనపల్లి రామ్మోహనరావు పిలుపునిచ్చారు. సోమవారం సంఘ సభ్యులకు రూ.13 లక్షల మేర వ్యవసాయేతర రుణాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సహకార సంఘం ద్వారా రుణాలు అందజేస్తా మన్నారు. తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి సంఘ అభివృద్ధికి పాటుపడాలన్నారు. సీఈవో ఆడారి వేణుగోపాలరావు, సీనియర్ ఉద్యోగి పెంటకోట మహేష్ పాల్గొన్నారు.

మత్స్యకారులకు పూర్తి స్థాయి ప్యాకేజీ ఇవ్వాలి



స్పందనలో వినతి పత్రం అందజేస్తున్న సూరాడ ధనరాజ్ తదితరులు

అచ్యుతాపురం(అనకాపల్లి): పూడిమడక మత్స్యకారులకు ప్యాకేజీ విషయంలో త్వరితగతిన చర్యలు తీసుకోవాలని పూడిమడక వైఎస్సార్‌సీపీ గ్రామ అధ్యక్షుడు సూరాడ ధనరాజ్ జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు సోమవారం స్పందనలో ఆయన వినతి పత్రం అందజేశారు. కంపెనీల ఏర్పాటు వల్ల పూడిమడక మత్స్య సంపదకు తీవ్ర నష్టం వాటిల్లిందని, పరోక్షంగా, ప్రత్యక్షంగా నష్టపోయిన మత్స్యకార కుటుంబాలకు పూర్తి స్థాయిలో ప్యాకేజీ అందిస్తామని చెప్పిన కంపెనీలు పట్టించుకోవడం లేదని ఆయన వాపోయారు. ఈ కార్యక్రమంలో అర్జిల కాసుబాబు, ఉమ్మిడి గంగయ్య, గనగల్ల ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.

21 నుంచి సామాజిక తనిఖీ



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో చంద్రశేఖర్

కోటవురట్ల : జాతీయ ఉపాధి హామీ పథకం 14వ సామాజిక తనిఖీ కార్యక్రమం ఈ నెల 21 నుంచి 30వ తేదీ వరకు జరగనుందని ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం ఆయన ఉపాధి హామీ పథకం సిబ్బందితో సమావేశమై సామాజిక తనిఖీకి సంబంధించి సమీక్ష చేశారు. ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలో 2021–23 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధి పనులు, వేతనాలు, నిధుల వినియోగంపై సామాజిక తనిఖీ ఉంటుందన్నారు. మండలంలోని 25 గ్రామ పంచాయతీలలో సామాజిక తనిఖీ బృందం క్షేత్ర స్థాయిలో పర్యటించి రైతులు, కూలీల నుంచి వివరాలు సేకరించడంతో పాటు నిర్వహించిన పనులకు కొలతలు తీసుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీవో గంగునాయుడు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

జోరుగా గొర్రెలు, మేకల విక్రయాలు

కోటకోట: మండలంలోని తాళ్లపాలెం వారపు సంతలో సోమవారం గొర్రెలు, మేకల అమ్మకాలు జోరుగా సాగాయి. కొత్త అమావాస్య జాతరకు వీటికి గిరాకీ పెరిగింది. సాధారణ రోజుల కంటే రూ.3 వేల వరకు పరిమాణం అనుసరించి ఒక్కో గొర్రె, మేకకు ధర పెరగడంతో అదనపు ఆదాయం లభించిందని పెంపకందారులు, రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఉమ్మడి విశాఖ జిల్లాతోపాటు కాకినాడ జిల్లా నుంచి గొర్రెలు, మేకలు వెయ్యికి పైగా అమ్మకానికి తరలివచ్చాయి. వీటిని విశాఖ, గాజువాక, అనకాపల్లి, అచ్యుతాపురం తదితర ప్రాంతాల నుంచి వ్యాపారులు, హోటళ్ల నిర్వాహకు లు, ప్రజలు వచ్చి కొనుగోలు చేసి ఆటోలు, వ్యాన్లలో తరలించుకు వెళ్లారు.